ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ఏలూరు

జిల్లా వార్తలు

7

గురువారం 16 అక్టోబరు 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 22.0

చదువుల సందడి

ఉద్యోగులు, గృహిణులు, కళాశాల రెగ్యులర్ తరగతులకు హాజరు కాలేని వారికి, గ్రామీణ ప్రాంతాల వారికి ఉన్నత విద్యా కోర్సులను చదవాలనే వాంఛను తీర్చేందుకు ఉద్దేశించిన డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపనకు బుధవారం కీలక అడుగు పడింది. నవ్యాంధ్రప్రదేశ్ కోసం ప్రత్యేకంగా ఏలూరు సమీపంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఈ యూనివర్సిటీకి ఉప కులపతి(ఇన్‌చార్జి)గా ప్రొఫెసర్ ఎస్.విజయభాస్కరరావును నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. ఆయన ప్రస్తుతం ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్- 1గా వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జి వీసీ బాధ్యతలను గురువారం మంగళగిరిలోని ఉన్నత విద్యామండలి ప్రధాన కార్యాలయంలో చేపడతారు.



ఏలూరులోని అంబేద్కర్ స్టడీ సెంటర్


ప్రొఫెసర్ విజయభాస్కరరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

ఏలూరు జిల్లాలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటు !

- ఇన్‌చార్జ్ వీసీగా ప్రొఫెసర్ విజయభాస్కరరావు నియామకం
- నేడు మంగళగిరిలో బాధ్యతల స్వీకరణ
- వారం రోజుల్లోగా యూనివర్సిటీ వెబ్‌సైట్, అడ్మిషన్ల నోటిఫికేషన్‌కు సన్నాహాలు
- కార్యకలాపాలు ఇక వేగవంతం

(ఏలూరు అర్బన్-ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఉమ్మడి రాష్ట్ర ప్రయోజనాలు పొందేందుకు తుదిగడువు పదేళ్ల కాల పరిమితి 2024లో పూర్తి కాగా, అప్పటి వరకు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించిన అంబేద్కర్ యూనివర్సిటీలో ఏపీ విద్యార్థులకు గతేడాది నుంచి అడ్మిషన్లు నిలిచిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరిన కొంత కాలానికి అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి సారించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైనప్పటికీ ఏలూరులో ఇంత వరకు విశ్వ విద్యాలయం లేని విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం ఆ లోటును అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఏర్పాటుతో భర్తీ చేయనుంది.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించి ప్రత్యేకంగా ఏపీ నుంచి విశ్వ విద్యాలయం ఆఫర్ చేసే 21 ప్రోగ్రాంలతో కూడిన డిగ్రీ, పీజీ కోర్సుల్లో సుమారు 40 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకుంటుంటారు. ఈ సంఖ్యలో ఏటా స్వల్ప మార్పులుంటాయి. కేవలం రూ.3,500 డిగ్రీ ఆర్ట్స్ ప్రోగ్రాం పూర్తి చేయడానికి ఏడాది ఫీజుగా వసూలు చేస్తుంటారు. ఈ క్రమంలో కేవలం డిగ్రీ అడ్మిషన్ల నుంచే యూనివర్సిటీకి ఏడాదికి రూ.12 కోట్లు ఫీజుల రూపేణా జమ అవుతుంటాయి. ఇక పీజీ ప్రోగ్రాంల అడ్మిషన్ల ఫీజులు అదనం. ప్రస్తుతం రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి 72 రీజినల్ సెంటర్లు జిల్లా కేంద్రాల్లోను, ఎంపిక చేసిన పట్టణ ప్రాంతాల్లో స్టడీ సెంటర్లున్నాయి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ఏలూరు, చింతలపూడి, భీమవరంలలో రీజినల్ స్టడీ సెంటర్లు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రెండేళ్లుగా (2024-25, 2025-26) యూనివర్సిటీ లేకపోవడంతో అడ్మిషన్లు నిలిచిపోయాయి.

వారం రోజుల్లో అడ్మిషన్ల నోటిఫికేషన్

- వీసీ నియామకంతో ఒక్కసారిగా జోష్ అందుకుంది. వర్సిటీకి ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించి అమల్లోకి తీసుకురావడం, 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీని వారం రోజుల్లోగా పూర్తి చేయడానికి కార్యాచరణను ప్రారంభిస్తున్నారు. అడ్మిషన్లు ప్రారంభమయ్యే నెల నుంచి మరుసటేడాది అదే నెల వరకు లెక్కించి ఒక విద్యా సంవత్సరంగా పరిగణించేలా నోటిఫికేషన్ విడుదల చేయనున్నందున ప్రస్తుత అకడమిక్ ఇయర్‌ను విద్యార్థులు నష్ట పోకుండా చర్యలు తీసుకుంటామని వివరించాయి. విశ్వవిద్యాలయం ఇకమీదట అంబేడ్కర్ డిజిటల్ ఓపెన్ యూనివర్సిటీగా ఉంటుందన్నాయి.

ఏలూరులో వర్సిటీకి ప్రతిపాదనలు

యూనివర్సిటీకి కొన్ని నెలలక్రితమే ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం ఆ మేరకు విశ్వ విద్యాలయ కార్యకలాపాలను ప్రస్తుతం విజయవాడలోని ఎస్ఆర్ కళాశాలలో ఓ భవనంలో తాత్కాలికంగా నిర్వహిస్తోంది. విశ్వ విద్యాలయ ప్రత్యేకాధికారి డాక్టర్ వెలగా జోషి, ఓ క్లర్క్ ప్రస్తుతం ఇక్కడి తాత్కాలిక భవనం నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఏలూరు జిల్లాకు మంజూరు చేసిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి భవనాల సేకరణకు ప్రస్తుతం అన్వేషణ జరుగుతోంది. తొలుత ప్రభుత్వానికి చెందిన భవనాల్లో యూనివర్సిటీ పరిపాలనా (మిగతా 8వ పేజీలో)

ఆక్వా చెరువుల ఆన్‌లైన్‌ను సకాలంలో పూర్తి చేయాలి



ఏలూరు టూ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆక్వా చెరువులను ఏపీ ఆక్వాకల్చర్ అభివృద్ధి అథారిటీ యాక్ట్‌లో రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్ చేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన అధికారులతో సమావేశం జరిగింది. ఆక్వా చెరువుల ఆన్‌లైన్ ప్రక్రియ ఇప్పటి వరకు 50 శాతం పూర్తి చేయలేదని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. టార్గెట్లు పూర్తి చేయని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి, ఏలూరు, దెందులూరు, పెదపాడు, నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో లక్షా 49 వేల 828 ఎకరాలు ఉండగా ఇప్పటి వరకు 52,613 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. ఎల్‌పీఎం అప్‌డేషన్ గురువారానికి కనీసం ఎనిమిది వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించారు. కొల్లేరు భూములు వైల్డ్‌లైఫ్ పరిధిలో ఉండటంతో ఆ భూములకు లైసెన్సులు ఇవ్వకూడదన్నారు. మత్స్యశాఖ జేడీ షేక్‌లాల్‌మహ్మద్, జిల్లా మత్స్యశాఖాధికారి నర్సయ్య పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో జీవించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సమాజంలో విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంతో జీవించేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. జాతీయ వైట్ కేన్ దినోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్ వద్ద ర్యాలీని ప్రారంభించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌కుమార్, విజువల్లీ ఛాలెంజెడ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాధారాణి, జీడీవీఎస్ వీరభద్రరావు, కె.మదన్, ఆర్.కర్ణుడు, వై.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత



‘మూడేళ్లకు తొలగింపు’ నిబంధన ఎత్తివేత.. జిల్లాలో 1,354 మందికి ప్రయోజనం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

గ్రామ సంఘాల సహాయకులు(వీవోఏ) ముఖాల్లో కూటమి ప్రభుత్వం వెలుగులు నింపింది. ఉద్యోగ భద్రత కల్పించేలా మూడేళ్ల నిబంధనను సీఎం చంద్రబాబు తొలగించి వారికి భద్రత కల్పించారు. అలాగే వీరికి 5జీ నెట్‌వర్క్‌తో పనిచేసే మొబైల్ ఫోన్లు అందించనున్నారు. ఈ నిర్ణయంతో జిల్లాలోని 1,354 మంది మహిళలకు ప్రయోజనం కలగనుంది. పల్లెలు, పట్టణాల్లో ప్రభుత్వ పథకాలను పేదలకు చేరవేయడంతోపాటు, డ్వాక్రా సంఘాల రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ స్వయం సహాయక సమావేశాలు నిర్వహణ, 100 శాతం రుణాల వసూళ్లు తదితర పనుల నిర్వ హణ అంతా వీవోఏలదే బాధ్యత. 2005లో కమ్యూనిటీ యాక్టివిస్ట్(సీఏ)గా విధుల్లోకి చేరిన వీరికి నెలకు కేవలం రూ.250 వేతనం ఉండేది. 2014లో చంద్రబాబు ప్రభుత్వం దీనిని ఒక్కసారి రూ.2 వేలకు పెంచింది. తర్వాత క్రమంగా పెరుగుతూ ప్రభుత్వం తాజాగా రూ.8 వేలు ఇస్తున్నారు.

వీవోఏలతో వైసీపీ ఆటలు

వైసీపీ ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలతో వీవోఏల ఉద్యోగాలతో ఆటలాడుకుంది. టీడీపీకి అనుకూలంగా వున్నారనే అభియోగంతో వారిని తొలగించడానికి మూడేళ్లపాటు విధుల్లో ఉంటే తొలగించే హక్కును చట్టంగా మార్చింది. అధికార దర్పంతో వారికి ఉద్యోగ భద్రత లేకుండా చేసింది. ఎక్కడికక్కడ మండల పరిధిలో పనిచేసే వెలుగు ఏపీఎంలకు వీరిని ఉద్యోగ విధుల నుంచి అకారణంగా తొలగించే బాధ్యతను అప్పగించింది. మూడేళ్ల నిబంధన తొలగించాలని వీవోఏలు ఆందోళన చేసిన పట్టించుకోలేదు. వీరి ఆందోళనను గుర్తించిన చంద్రబాబు (మిగతా 8వ పేజీలో)

ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మేలు



- గ్రామీణ ప్రాంతాల మహిళల ఆర్థిక జీవన విధానాల్లో మెరుగైన అభివృద్ధి వీవోఏల కీలక పాత్ర పోషిస్తున్నారు. కాల పరిమితి మూడేళ్ల అన్న సర్క్యులర్ రద్దు చేయడం సంతోషదాయకం. రెండు నెలల్లో నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వనుండటం శుభ పరిణామం. హెచ్ఆర్ పాలసీ, కనీసం వేతనం అమలు చేయాలి.

  \- నాగలక్ష్మి, వెలుగు వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు



- మూడేళ్ల కాలపరిమితి ఎత్తేయడంపై కూటమి ప్రభుత్వం నిర్ణయం హర్షణీయం. కొత్త నిర్ణయంతో స్వయం సహాయక సంఘాలను మరింత పటిష్టంగా, ఆసక్తిగా నిర్వహించడానికి అవకాశం కలిగింది. ఈ సంఘాలను ఎటువంటి లోపాలు లేకుండా సక్రమంగా నిర్వహించేందుకు దోహదపడుతుంది. వీవోఏలకు ఉద్యోగ భద్రత ఏర్పడింది.

  -ఎం.ప్రియదర్శిని వీవోఏ ములకలపల్లి

> అధికారితో..
>
> **ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్**
>
> ఏలూరు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. నగర ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్య సమస్యలు, పందులు, కుక్కల బెడద, వీధి లైట్లు, పార్కుల అపరిశుభ్రత తదితర అంశాలపై సెల్ నెంబరుకు 94408 88786 ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వాటి పరిష్కారానికి మేయర్ చర్యలు తీసుకొంటారు.

ఇడా వైస్‌చైర్మన్‌గా జేసీ అభిషేక్ గౌడ

ఏలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఇడా) వైస్ చైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎంజే అభిషేక్ గౌడను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులను బుధవారం జారీచేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు వైస్ చైర్మన్‌గా గతంలోనే జాయింట్ కలెక్టర్లే వ్యవహరించడంతో, ఇటీవల అభిషేక్ గౌడ జేసీగా బాధ్యతల స్వీకరణతో ఆయనకే పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

బంగారం భద్రమేనా ?

పెరిగిన బంగారం ధరలతో వీటి భద్రతకు ముప్పు వాటిల్లింది. కుటుంబ అత్యవసర అవసరాల నిమిత్తం బ్యాంకులు, వ్యాపారుల వద్ద తాకట్టు పెడితే.. వాటికి రెక్కలు వస్తున్నాయి. సాధారణంగా జాతీయ బ్యాంకుల్లో బంగారాన్ని కుదువ పెట్టుకునేందుకు సవాలక్ష నిబంధనలు పెడుతుంటారు. దీనితో ప్రజలు ప్రైవేట్ బ్యాంకులు, ప్రైవేట్ బంగారు తాకట్టు వ్యాపారులను ఆశ్రయిస్తుంటారు. ఇటీవల చోటు చేసుకుంటున్న ఘటనలతో ప్రైవేట్ బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలలోని తాకట్టుదారుల వద్ద ఉంచిన బంగారం భద్రమేనా ? అనే అనుమానాలు ఉత్పన్నమవుతున్నాయి.

పెరిగిన ధరలతో ‘తాకట్టు’కు నీలినీడలు

- ఓ ప్రైవేటు బ్యాంకులో బంగారం మాయంపై ఫిర్యాదు
- 8.68 లక్షల విలువైన 12 మంది ఆభరణాలు మాయం
- విడిపించుకునేందుకు వెళితే.. షాకింగ్ సమాధానం
- ఆందోళనలో వినియోగదారులు



(నూజివీడు-ఆంధ్రజ్యోతి):

ఇళ్ల వద్ద ఎవరూ లేని సమయంలో కొల్లగొట్టే దొంగలు కొందరైతే, పలు ప్రైవేట్ బ్యాంకులు, సంస్థలలో బంగారం మాయం చేసేవారు మరికొందరు. ఈ పరిస్థితులతో తమ బంగారానికి భద్రత ఏదీ అంటూ సగటు మధ్య తరగతి పౌరులు ఆందోళన చెందుతున్నారు. జాతీయ బ్యాంకులతో పోలిస్తే అర్ధ సంవత్సర, సంవత్సర కాలంతో గోల్డ్‌లోన్‌లు రెన్యువల్ చేస్తూ వినియోగదారులను దోపిడీ చేస్తున్నారు. అయినా అవసరం కోసం తనఖా పెట్టిన బంగారం విడిపించుకునేందుకు వెళ్లగా పలుమార్లు తిప్పించుకుంటున్నారు. చివరకు మీ బంగారం కనిపించడం లేదు వెతికి ఇవ్వాలని చెప్పడంతో వినియోగదారులు షాక్ అవుతున్నారు. చివరకు ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగులను నిలదీస్తే తమకు ముందు పని చేసిన వారు మీ బంగారాన్ని దుర్వినియోగం చేశారు. వారిపై ఫిర్యాదు చేస్తున్నామంటూ సదరు ప్రైవేట్ బ్యాంకులు చేతులు దులుపుకుంటుండగా, తాకట్టు పెట్టిన వారు మాత్రం ఏం చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు.

ఇటీవల నూజివీడులో మణప్పురం గోల్డ్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టిన తన బంగారం తిరిగి ఇవ్వాలంటూ ఓ వినియోగదారుడు అడగ్గా సదరు సంస్థలో బంగారం మాయ విషయం వెలుగుచూసింది. చివరికి ఈ సంస్థ ఆడిట్ అధికారులు తమ సంస్థలో బంగారం మాయమైందని గుర్తించారంటూ సదరు సంస్థ రీజనల్ మేనేజరు ఆర్.కొండలరావు, నూజివీడు పట్టణ పోలీసులకు తమ పాత ఉద్యోగులపై ఫిర్యాదు చేయడం విశేషం. 12 మందికి చెందిన రూ.8.68 లక్షల విలువైన బంగారు ఆభరణాలు మాయమైనట్లు ఆడిటింగ్ సిబ్బంది గుర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మరికొన్నింటిపైన ఆరోపణలు

ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్‌లు అందిస్తున్న మరికొన్ని ప్రైవేట్, కో ఆపరేటివ్ సంస్థలపైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంగారు తాకట్టుపై రుణాలు ఇచ్చిన ఈ సంస్థలో కొన్నింటికి సక్రమంగా ఆడిటింగ్ లేకపోవడం, వడ్డీలు, చక్ర వడ్డీలతో బంగారాన్ని విడిపించుకోలేని విధంగా రుణభారాన్ని పెంచడంతో తాకట్టు పెట్టిన వారు సదరు బంగారాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ విధంగా సంబంధిత సంస్థలు బంగారాన్ని కైంకర్యం చేస్తుండటంతో తమ సంస్థల్లో బంగారం మాయమైన ఘటనలు ఇవి కప్పి పుచ్చుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా సంస్థల ఉన్నతాధికారులు బంగారం మాయం అవుతున్న విషయం గుర్తించినా తమ సంస్థపై వ్యతిరేక ప్రచారం జరుగుతుందనే ఉద్దేశంతో బంగారం స్వాధీనం రూపేణా తమ లోపాలను కప్పి పుచ్చుకుంటున్నారు.

జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం 9

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ముక్కంటి

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, విద్య, వైద్యం, వ్యవసాయ, నిరుద్యోగ యుతకు ఉపాధి, పథకాలు అమలు జరుగుతున్నాయని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి పేర్కొన్నారు. కేంద్ర షెడ్యూల్ కులాలకు, యువ వ్యాపారవేత్తలకు బ్యాంకు సహకారంతో అమలు చేస్తున్న పథకాలపై ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బ్యాంక్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని పడమర వీధిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు శ్రీవారి పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వీరమాచనేని చందు, కార్య నిర్వహణాధికారి పి.రీణామాధురిలు తెలిపారు. ఉత్సవాలు జరిగే నాలుగు రోజులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, హోమాలు జరుగుతాయని, 19వ తేదీన పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.



హైకోర్టు జడ్జి సురేశ్ రెడ్డికి, సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం, పూల మొక్కలు అందజేస్తున్న ఎస్పీ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

హైకోర్టు జడ్జిలను కలిసిన ఎస్పీ, ఏఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుపోలియో జడ్జి కె.సురేష్ రెడ్డి, హైకోర్టు జడ్జి సత్తిసుబ్బారెడ్డి బుధవారం జిల్లా పర్యటనకు వచ్చారు. వారిని ఎస్పీ కేపీఎస్.కిశోర్, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించారు. జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, న్యాయాధికారులు ఎం.రామకృష్ణంరాజు, ఇందిరా ప్రియదర్శిని, ఆర్‌వీవీఎస్.మురళీకృష్ణ, వై.శ్రీనివాసరావు, ఐ.శ్రీనివాసమూర్తి, కె.వాణిశ్రీ, మేరీ గ్రేస్‌కుమారి, న్యాయవాదులు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, సీఐలు కోటేశ్వరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

జిల్లాలో నెలపాటు పరిశ్రమ భాగస్వామ్య డ్రైవ్ : కలెక్టర్



ఏలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెల రోజుల పాట ఏపీఐసీసీ పరిశ్రమ భాగస్వామ్య డ్రైవ్‌ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏపీఐఐసీ పరిశ్రమ భాగస్వామ్య డ్రైవ్‌పై ముద్రించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ నెల 15 నుంచి నవంబరు 15వ తేదీ వరకు నెల రోజుల పాటు పరిశ్రమ భాగస్వామ్య డ్రైవ్ అమలు చేస్తున్నామన్నారు. జిల్లా పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ పాల్గొన్నారు.

పోలీస్ టెన్నిస్ కోర్టు ప్రారంభించిన ఎస్పీ కిశోర్



ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ సిబ్బంది శ్రమదానంతో టెన్నిస్ కోర్టు నిర్మించగా దానిని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ బుధవారం రాత్రి ప్రారంభించారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పర్యవేక్షణలో ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్ఐ జీఎస్‌వీపీ కుమార్, ఆర్ఎస్ఐలు కె.వెంకట్, భాస్కరరావు, అమరేశ్వరరావు, ఏఎన్ఎస్ కానిస్టేబుల్ వి.వర ప్రసాద్ నాయక్ ఆధ్వర్యంలో ఏఆర్‌హెడ్‌కానిస్టేబుల్ బి.సుగుణరావు, కానిస్టేబుళ్లు కె.సూర్యచంద్రరావు, పి.వి.రమణారావు, టి.ప్రతాప్, ఎం.మురళీకృష్ణ, హోంగార్డులు జి.చిన్ని, కె.శ్రీకాంత్, సాయికుమార్, సి.హెచ్.చింతయ్య, వి.చంద్రతేజల శ్రమదానంతో ఈ కోర్టు ఏర్పాటు చేయడంతో ఎస్పీ అభినందించారు.

పెట్రోలియం కమిటీ సమావేశానికి ఎంపీ హాజరు

ఏలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో బుధవారం జరిన పెట్రోలియం, సహజవాయువు పార్లమెంటరీ స్థాయి సంఘ సమావేశానికి ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ హాజరయ్యారు.ఈ సంఘానికి సభ్యుడిగా ఇటీవల ఎంపీ ఎన్నికయ్యారు. సమావేశంలో కమిటీ చైర్మన్ తత్కరే సునీల్ దత్తాత్రేయ, పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ అధికారులు, పబ్లిక్ సెక్టార్ యూనిట్లు(పీఎస్‌యూ) ప్రతినిధులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు.

ర్యాగింగ్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలి : ఏఎస్పీ

పెదపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):ర్యాగింగ్ భూతం విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తుందని, దానికి దూరంగా ఉండాలని ఏలూరు జిల్లా ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు తెలిపారు. యాంటీ ర్యాగింగ్ సెల్ ఆధ్వర్యంలో పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలనకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థులచే ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

జాబు కార్డు కలిగి ఉన్నవారికి ఈకేవైసీ తప్పనిసరి

టి.నర్సాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో జీ.మణికుమారి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నూతనంగా జరిగిన మార్పులపై ఆమె బుధవారం సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఉపాధి శ్రామికులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. గత 12 రోజులుగా గ్రామ పంచాయతీల్లో గ్రామ స్థాయిలో ఈకేవైసీ జరుగుతుందన్నారు.

ఖరీఫ్ కోసం గోనె సంచులపై తహసీల్దార్ ఆరా



భీమడోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతు సేవా కేంద్రాల్లో గోనె సంచుల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని భీమడోలు తహసీల్దార్ రమాదేవి సూచించారు. భీమడోలు మండలంలోని భీమడోలు, పూళ్ల తదితర గ్రామాల్లోని పలు రైసు మిల్లులను తహసీల్దార్ రమాదేవి సందర్శించి గోనె సంచుల వివరాలడిగి తెలుసుకున్నారు. రైస్ మిల్లర్లు సంబంధిత సిబ్బంది చిరుగులు లేని నాణ్యమైన సంచులు సమకూర్చేలా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

చదువుల సందడి

(7వ పేజీ తరువాయి)

భవనం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి డిగ్రీ, పీజీ అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు తరగతుల నిర్వహణ కోసం అందుబాటులోవున్న భవనాలు ఎక్కడున్నాయనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి చెంతన హనుమాన్ జంక్షన్ - నూజివీడు మార్గంలో విశ్వ విద్యాలయం ఏర్పాటుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నారు. ఏలూరు జిల్లాలోనే నూజివీడు ఉండటం కలిసొచ్చే అంశం. ఆ తర్వాత దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన బాలుర వసతి గృహం భవనాన్ని పూర్తి చేసి అక్కడ యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని ముందుగా ప్రారంభించి, ఆ తదుపరి కళాశాల ప్రాంగణంలోనే విడిగా వున్న 6.50 ప్రభుత్వ పోరంబోకు భూముల్లో విశ్వ విద్యాలయానికి అవసరమైన అన్ని భవనాల నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఒకటి పరిశీలనలో ఉంది. ఈ క్రమంలో కళాశాలలో రూ.66 లక్షలు ఖర్చు చేసి, ఇప్పటికే 50 శాతానికిపైగా నిర్మాణాలు పూర్తయి అసంపూర్తిగా నిలిచిపోయిన బాలుర వసతి గృహాన్ని పూర్తి చేయడానికి మరో రూ.25 లక్షలు సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయడానికి ఏలూరు ఎంపీ ఇటీవల హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వద్ద పట్టుబట్టినట్టు సమాచారం. ఇక గతంలోనే విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో యూనివర్సిటీ భవన నిర్మాణం నిమిత్తం స్థానిక గ్రామ పంచాయితీకి చెందిన 120 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్నికూడా అధికారవర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏలూరుకు సమీపంలో ఏర్పాటుచేయతలపెట్టిన అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపన ఖరారు ఏ ప్రాంతంలో ఉంటుందోనన్న డైలమా కొంతకాలంగా కొనసాగుతూనే ఉంది. తాజాగా విశ్వ విద్యాలయానికి ఉపకులపతిని నియమించడంతో ఇప్పటి వరకు వున్న గందరగోళ పరిస్థితులకు తెరపడే అవకాశం ఉంది.

వీవోఏలకు ఉద్యోగ భద్రత

(7వ పేజీ తరువాయి)

అధికారంలోకి వస్తే మూడేళ్ల నిబంధన తొలగిస్తామని హామీ ఇచ్చారు. తాజాగా ఈ నిబంధనలను తొలగించడంతోపాటు వీరిని తొలగించే అధికారాన్ని ఏపీఎం నుంచి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు బదలాయించారు. వీవోఏలపై మరింత పనిభారంతో సతమతం అవుతున్నారు. ఎస్‌హెచ్‌జీల యాప్‌ల నిర్వహణకు 4జీ నెట్‌వర్క్‌తో సాధ్యం కాకపోవడంతో దానిని 5జీ నెట్ వర్క్‌తో పనిచేసే మొబైల్ ఫోన్లు అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 1,354 మంది మహిళలకు ప్రయోజనం కలగనుంది.

సీఎం దూరదృష్టికి తార్కాణం

ఏలూరుసిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గూగుల్ సెంటర్ సర్వీసులు రావడం చారిత్రాత్మక ఘట్టమని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ బుధవారం తెలిపారు.సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌ల దూరదృష్టి, కృషి ఫలితంగా ఏపీ మరో గొప్ప విజయాన్ని సాధించిందన్నారు. గూగుల్ క్లౌడ్ పెట్టుబడులతో ఐటీ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏపీ టెక్నాలజీ భవష్యత్‌కు నూతన దశను తెరుస్తున్న చారిత్రాత్మక అడుగని అన్నారు. రాష్ట్ర యువతకు భవిష్యత్ మరింత వెలుగునిచ్చేలా మారుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్ర ముఖ చిత్రం మారుతుంది : చంటి

ఏలూరుటూటౌన్: విశాఖలో గూగుల్ సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. గూగుల్ ఐటీ సెంటర్‌తో రాష్ట్ర ముఖచిత్రం మారనుందన్నారు. సీఎం చంద్ర బాబు పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణం కల్పించడంతో గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు. రాష్ట్రానికి 11లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రావడంతో 9.5 లక్షల ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉందన్నారు. రూ.55 వేల కోట్ల రూపాయలతో డేటా సెంటర్ ఏర్పాటవడం సౌత్ ఆసియాలోనే ఒక మైలురాయి అని అన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో గూగుల్ సెంటర్ ఏర్పాటుతో రాష్ట్ర భవిష్యత్తు మారనుందన్నారు. గూగుల్ రాకతో విశాఖ ఖ్యాతి విశ్వవ్యాప్తం అవుతుందన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఏఐ హబ్‌గా అవతరిస్తుందని, 2047 నాటికి రాష్ట్రం స్వర్ణాంధ్ర గా తయారవుతుందన్నారు.

▸▸ గూగుల్ డేటా ఏఐ హబ్ సెంటర్ ఏర్పాటుపై సర్వత్రా హర్షం

సాంకేతికతను అందిపుచ్చుకుంటాం: రోషన్

చింతలపూడి: అత్యుత్తమ ప్రాజెక్టు గూగుల్ డేటా ఏఐ హబ్ సెంటర్ ఏర్పాటుతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన సాంకేతిక విలువలను అందిపుచ్చుకోవడంలో ముందున్నామని, ఈ టెక్నాలజీతో ఏపీలో పార్యాంశాలు కొత్తగా రాబోతున్నాయన్నారు. గ్రామీణ స్థాయిలోనూ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని, విస్తృత సేవలు అందుతాయన్నారు. ఈ ఏఐ హబ్ దేశానికి, ఏపీకి మాత్రమే కాకుండా ప్రపంచలో 12దేశాలకు సేవలందుతాయని, ఈ చారిత్రాత్మక విజయం చంద్రబాబుదేనని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్

నేడు ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ

దెందులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలం చల్లచింతలపూడి శివారు కొత్త కమ్మవారిగూడెంలో నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నామని శ్రీపుంతలో ముసలమ్మ తల్లి ఆలయ నిర్వాహకులు కమ్మ నరేంద్ర, రత్నమాణిక్యం, కమ్మ బ్రహ్మాజీ దంపతులు తెలిపారు. శుక్రవారం ఉదయం 11:52 నిమిషాలకు జ్యోతిష్య బ్రహ్మ శ్రీబేరముక్కుల మురళీకృష్ణ శాస్త్రి, నాగవెంకట భవానీ, విశ్వనాథ అనిల్ కుమార శర్మల ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నామన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక

కామవరపుకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో త్వరలో జరగనున్న హ్యాండ్ బాల్ పోటీలకు ఆడమిల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన వేముల రాకేశ్ ఎంపికయ్యారు. పెదవేగి మండలం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులం వద్ద మంగళవారం జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో రాకేశ్ ఎంపికవడం పట్ల ఆడమిల్లి హెచ్ఎం ఘంటా రవిచంద్ర మోహన్, పీడీ మానుకొండ సుబ్బారావులు తెలిపారు. ప్రతిభ సాధించిన రాకేశ్ రాష్ట్ర స్థాయికి ఎంపికవడం పట్ల సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ బీసీ సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు జిజ్జూరి బాబ్జి, స్థానికులు అభినందించారు.

అష్టోత్తర శత చండీ యాగం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రం ఆధ్వర్యంలో అగ్రహారంలోని నగరేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 13నుంచి జరుగుతున్న అష్టోత్తర శతచండీ యాగం ఘనంగా జరుగుతోంది. బుధవారం గణపతి పూజలు, చండీపారాయణం, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరానికి చెందిన శైవాగమ శాస్త్ర పండితులు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని శిష్య బృందంతో కార్యక్రమాలు జరిపించారు. 17వ తేదీ వరకు చండీయాగం కొనసాగుతుందని ఆలయ ఈవో నాగబాబు, అర్చకులు నానిలు తెలిపారు.

తలసీమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరుక్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసీమియా భవనంలో తలసీమియా, సికిల్ సెల్ ఎనీమియా చిన్నారుల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వి ప్రసాద్ తెలిపారు. డాక్టర్ ప్రసాద్, ప్రముఖ చిన్న పిల్లల వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి రోగులను పరీక్షించి, అవసరమైన మందులను సూచించి, తల్లిదండ్రులకు వైద్య సలహాలిచ్చారు. అనంతరం 8 మందికి రక్తమార్పిడి చికిత్స నిర్వహించారు. రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ జె.సత్యనారాయణరాజు, డాక్టర్లు వి శ్రీదేవి, పీఎఆర్ఎస్ శ్రీనివాస్, ఎస్ ఆల్బర్ట్, యువీఎస్ శాస్త్రి, ఈ రేణుశ్రీ, రెడ్‌క్రాస్ కార్యదర్శి జెన్నీ, సంకల్ప్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు అభిజిత్ అయ్యంగార్, సంతోష్ కమిటీ సభ్యులు ఎంవిఎస్ నాగేశ్వరరావు, ఎ.నాగేశ్వరరావు, ఎం.అజయ్‌బాబు పాల్గొన్నారు.



కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చింతమనేని

యువతకు అబ్దుల్ కలాం స్ఫూర్తి

పెదవేగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను యువత స్ఫూర్తిగా తీసుకుని, ఉన్నతంగా ఎదగాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. డాక్టర్ అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని పెదవేగి మండలం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జీతాలు, పీఎఫ్ సొమ్ము చెల్లించండి

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల జీతాలు, పది నెలల పీఎఫ్ సొమ్ము బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రులలో పని చేసే పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. జిల్లాలో ఉన్న సెకండరీ హెల్త్ ఎడ్యుకేషన్ విభాగంలో బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం, చింతల పూడి, భీమడోలు, దెందులూరు, కైకలూరు, నూజి వీడు, పోలవరం ప్రభుత్వాసుపత్రులలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు నాలుగు నెలల నుంచి జీతాలు బకాయిలు ఉన్నాయని, పది నెలల నుంచి పీఎఫ్ సొమ్ము బకాయిలు ఉన్నాయని వీటిని ఇవ్వాలని గత కొంతకాలం నుంచి అధికారులకు విన్నవించినా తమ సమస్య పరిష్కారం లేదని కార్మికులు వాపోతున్నారు.

గోవుల అక్రమ రవాణా అడ్డగింత


పెదపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అరకు నుంచి చిలకలూరిపేటకు అక్రమ పద్ధతిలో మూడు భారీ కంటైనర్లలో 75 గోవులను తరలిస్తుండగా పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ వద్ద బుధవారం రాత్రి కూటమి శ్రేణులు అడ్డుకున్నారు.గూడ్స్ రవాణా పేరుతో కంటైనర్లలో రహస్యంగా గోవులను తరలిస్తుండటంతో టోల్‌గేట్ వద్ద మార్కెట్ కమిటీ సిబ్బంది గుర్తించి అడ్డగించారు. సమాచారం అందుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు విక్రం కిశోర్, గారపాటి రామసీత, కట్నేని కృష్ణప్రసాద్‌తో పాటుగా పలువురు నాయకులు ఆ ప్రాంతానికి చేరుకుని గోవులను సంరక్షణ నిమిత్తం గోసంరక్షణశాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. అభయాంజనేయస్వామి దేవాలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, గుత్తా అనిల్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

లింగపాలెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శుభ్రంగా ఉండటంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని హెచ్ఎం కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో గ్లోబల్ హ్యాండ్‌వాష్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహ కల్పించారు. చిన్నతనం నుంచే ఆరోగ్య పరమైప విషయాలను తెలుసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

జీవన ఎరువులను వాడాలి

పెదవేగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వినియోగంతో నాణ్యమైన పంట దిగుబడి సాధ్యమని ఏలూరు డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ కె. ఫణి కుమార్ అన్నారు. మండలంలోని పెదకడిమిలో జీవన ఎరువుల వినియోగంతో కలిగే లాభాలు, ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ జీవన ఎరువులు నేలలో సహజ సిద్ధంగా లభించే సూక్ష్మజీవులను పెంచి, భూసారం, పంటల ఉత్పాదకతను పెంచుతాయన్నారు. జీవన ఎరువుల వినియోగం ద్వారా భూమి సారం, ఉదజని సూచిక మెరుగవుతుందన్నారు. జీవన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువుల వాడకాన్ని రైతులు ఎక్కువగా వినియోగించాలన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు సేవా కేంద్రం దగ్గర గ్రామ పటాన్ని ఏర్పాటు చేసి, గ్రామ స్థాయి పరిస్థితులు, పంటల సాగుపై అవగాహన కల్పించారు. పెదకడిమి సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, పెదవేగి మండల వ్యవసాయాధికారి సి.హెచ్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

చూపులేదని కుమిలిపోవద్దు

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లూయీస్ బ్రెయిలీ చూపు లేదని కుమిలిపోలేదని, తానేంటో ప్రపంచానికి తెలియజెప్పారని, దివ్యాంగులు తమలోని లోపాలను తలుచుకుని బాధపడకుండా లక్ష్యం దిశగా పయనం సాగించాలని విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అన్నారు. బుధవారం యాదవ సంఘం భవనంలో విజువల్లీ ఛాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏపీ ఏలూరు జిల్లా బ్రాంచ్ ఆధ్వర్యంలో అంధుల తెల్ల చేతికర్ర దినోత్సవం నిర్వహించారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ హరనాథ్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నెరుసు రామారావు పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీరభద్రరావు దృష్టి లోపం ఉన్నవారు పడుతున్న ఇబ్బందులను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని రెడ్డి అప్పలనాయుడును కోరారు. అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి జి.రాధారాణి, ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కె మదన్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్ కర్ణుడు, కోశాధికారి వై.రమేశ్ పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంకులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు టూ టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మూడు వేల లీటర్ల సామర్థ్యం కలిగిన సెప్టిక్ ట్యాంకు తోడే వాహనమిషన్ల కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం. ముక్కంటి తెలిపారు. ఐదుగురు ఒక గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు పట్టణాలకు చెందిన వారు అర్హులన్నారు. మురుగుశుద్ధి పనులను చేస్తున్నట్టు ధృవీకరణ పత్రం, గ్రూపులో ఒకరికి హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలన్నారు. ఎస్సీ కులానికి చెందిన అభ్యర్థులు ఈ నెల 18లోపు ఏలూరు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అందజేయాలన్నారు.



సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి, బొరగం

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

బుట్టాయగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బుధవారం శ్రీగుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం నుంచి ఆయకట్టు రైతులకు సాగునీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జలాశయం ఆయకట్టు పరిధిలోని 4500 ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందుతున్నట్లు తెలిపారు. అనంతరం అలివేరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయం, కొమ్ముగూడెంలో రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ పివి చలపతిరావు, ఈఈ లత, ఏఈ మురళి, సత్యనారాయణ, సీడీపీవో పద్మావతి, సర్పంచ్ కారం లక్ష్మీ, ఎంపీటీసీ గోవిందరాజు పాల్గొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు ఇచ్చినందుకు గాను ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఏలూరు అశోక్ నగర్‌కు చెందిన చిట్టిబోలు బలరామ్ గతంలో ఈవెంట్ ఆర్గనైజర్‌గా వ్యవహరించేవారు. ప్రస్తుతం ఆయన రాజమహేంద్రవరంలో ఓ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారు. ఏలూరులో ఉన్న సమయంలో అతను తన కుటుంబ అవసరాల నిమిత్తం నగరానికి చెందిన ఎం.సుధాకర్ రెడ్డి వద్ద రూ.6 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఆ బాకీ తీర్చే నిమిత్తం 2023 ఆగస్టులో రూ.4.5 లక్షల చెక్కును సుధాకర్ రెడ్డికి అందజేశారు. ఆ చెక్కును బ్యాంకులో జయచేయగా బౌన్స్ అయ్యింది. దీంతో బాధితుడు సుధాకరరెడ్డి కోర్టులో వేయగా విచారణ చేపట్టారు. తుది విచారణ అనంతరం చిట్టిబోలు బలరామ్‌కు బుధవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పాటు రూ.4.50 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. న్యాయవాది ఏపీఎస్ సూర్యారావు కేసు వాదించారు.

లోబ్రిడ్జిలో రాకపోకలు పునరుద్ధరణ

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం కురిసిన వర్షానికి శ్రీనివాస థియేటర్ సమీపంలోని లోబ్రిడ్జి వరదతో మునిగిపోయింది. దీంతో రెండు వైపులా గేట్లు మూసివేశారు. బుధవారం సాయంత్రం నీటి ప్రవాహం తగ్గడంతో రాకపోకలను పునరుద్ధరించారు. లోబ్రిడ్జి మూసివేయడం మూడ్రోజులుగా వాహనదారులు అనేక అవస్థలు పడ్డారు.

విద్యార్థినికి రూ.54 వేల ఆర్థిక సాయం

ఏలూరుక్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కష్టపడి మంచి మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ ట్రస్టు చేస్తున్న సహాయం ఎంతో గొప్పదని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు దొండపాడుకు చెందిన అర్జీ హేమహర్షిత ఇంటర్‌లో 980 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. బీటెక్ మొదటి సంవత్సరంలో ఫీజు కట్టలేకపోవడంతో హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో రూ.54 వేల నగదును ఏఎస్పీ చేతుల మీదుగా విద్యార్థిని హర్షితకు అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ చందనవెంకట్, హిమబిందు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

ద్వారకాతిరుమల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భక్తులకు, వాహనదారులకు గత కొన్నాళ్లుగా నరకం చూపుతున్న భీమడోలు-ద్వారకాతిరుమల ప్రధాన రహదారి మరమ్మతులను ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం ప్రారంభించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆదేశాలతో అధికారులు పనులు వేగవంతం చేశారు. రహదారి మరమ్మతుల పనులు చేసేందుకు ఉపక్రమించారు. ప్రస్తుతం మార్జిన్లను సరిచేస్తున్నారు.

ప్రణీత్ దీక్షను విరమింపజేసిన ఎమ్మెల్యే

బుట్టాయగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కుల ధృవీకరణ పత్రం కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరాహార దీక్ష చేస్తున్న కుంజా ప్రణీత్ శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సందర్శించారు. వివరాలడిగి తెలుసుకున్నారు. కోర్టు ఆదేశాలున్నందున ప్రణీత్‌కు తక్షణమే పత్రాలను మంజూరు చేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. కలెక్టర్, ఆర్డీవోలు చెప్పినా తహసీల్దార్ స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రణీత్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఎ.ఫ్రాన్సిస్, బంధువులు ఉన్నారు.

రోడ్లు నిర్మించకపోతే ఆందోళన చేస్తాం

పోలవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏజన్సీలో రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం నెల రోజుల్లో చర్యలు తీసుకోవాలని లేదంటే ఆందోళన చేస్తామని సీపీఎం హెచ్చరించింది. బుధవారం పోలవరం మండల సీపీఎం కార్యదర్శి కారం భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు పాదయాత్ర నిర్వహించారు. సీనియర్ నాయకులు రేపల్లెవాడలో జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు.



గోమాతకు కవల దూడల జననం

కొయ్యలగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం పట్టణంలో అరుదైన ఘటన చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన మట్టా మురళీకృష్ణకు చెందిన సంకర జాతి ఆవుకు బుధవారం కవల దూడలు జన్మించాయి. డాక్టర్ బి.ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ గత 9 నెలల క్రితం ఈ ఆవుకు కృత్రిమ గర్భధారణ చేశామని, అయితే ఆడ, మగ దూడలు జన్మించడం అరుదైన ఘటన అన్నారు. గర్భంలో రెండు దూడల స్థితి సక్రమంగా లేకపోవడంతో తగిన జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఈ కవల దూడలు చూడటానికి పలువురు రైతులు తరలి వచ్చారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గురుకులంలో మెగా వైద్య శిబిరం

ద్వారకాతిరుమల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఐదవ తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న 794మంది విద్యార్థినులకు లయన్స్ మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీ రమణి ఆధ్వర్యంలో వైద్యులు కంటి చూపు, జనరల్ చెకప్, చర్మ వ్యాధుల పరీక్షలు జరిపారు. నిడదవోలు ఆర్ఆర్ లయన్స్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో దృష్టి లోపం ఉన్న 28 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు రిఫర్ చేయగా టీడీపీ సీనియర్ నేత, లయన్ మొగతడకల శ్రీనివాసరావు వాటిని స్పాన్సర్ చేశారు. అలాగే పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రవీణ్ కుమార్ చర్మ వ్యాధుల స్పెషలిస్ట్ డి.సుబ్బారావులు వైద్య పరీక్షలు జరిపి అవసరమైన బాలికలకు ఉచితంగా మందులు అందించారు.

22న చలో ఐటీడీఏ

బుట్టాయగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసితుల సమస్యలపై 22న సీపీఐ తలపెట్టిన ఛలో ఐటీడీఏ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివిజన్ కార్యదర్శి కారం దారయ్య పిలుపు నిచ్చారు. కొత్తపేటలో తెల్లం మునేశ్వరరావు అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమం జయప్రదం చేయాలని చోడెం దుర్గ, ఉయికె చంద్రం, బేతి కిషోర్, బి.ముత్యాలమ్మ, చోడెం రమణ కోరారు.

ఆశ్రమ పాఠశాలల పరిశీలన

బుట్టాయగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా కె.ఆర్.పురం ఐటీడీఏ పరిధిలోని ఎన్.ఆర్.పాలెం, చేగోండపల్లి, జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర, బాలికల పాఠశాలను బుధవారం గిరిజన సంక్షేమ అడ్మినిస్ట్రేషన్ డీడీ టి.కొండలరావు సందర్శించారు. పాఠశాలల పనితీరును అడిగి తెలుసుకున్నారు. పనితీరును మెరుగుపరచాలని సూచించారు. ఏటీడబ్ల్యూవో జనార్ధరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

అమరావతి సీఆర్డీఏ అసిస్టెంట్ డైరెక్టర్‌గా గంగన్నగూడెం వాసి

దెందులూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి సంస్థ సీఆర్డీఏ అసిస్టెంట్ డైరెక్టర్‌గా దెందులూరు వాసి సొంగా రవీంద్ర ప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన సొంగా రవీంద్రప్రసాద్ బుధవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

చింతలపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంటపల్లి పంచాయతీ మెతుకుమిల్లిగూడెంలో విద్యుత్, తాగునీటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోయారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇంటి నుండే తాగునీటిని తీసుకెళ్లే పరిస్థితి నెలకొందని, గతంలోనూ ట్యాంకు నుంచి బురద నీరు వచ్చేదని, పలుచోట్ల పైపులు లీకవుతున్నాయన్నారు.అధికారులు పట్టించుకోవడంలేదని, వారి దృష్టిలో ఈ గ్రామం ఉందో, లేదో కూడా అర్థం కావడంలేదని గ్రామస్థులు వాపోయారు.

నిబంధనలు పాటించాలి

కొయ్యలగూడెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాణసంచా నిర్వాహకులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ నాగరాజు, ఎస్.ఐ. చంద్రశేఖర్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మార్కెట్ యార్డు దగ్గర బాణసంచ దుకాణదారులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్, ఎస్.ఐ.లు మాట్లాడుతూ వ్యాపారులంతా నిబంధనలు పాటించాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● దెందులూరు: మండలంలోని సోమవరప్పాడు ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో దీపావళి మందుగుండు సామగ్రివిషయంలో అనుసరించాల్సిన భద్రతపై పెదవేగి సీఐ సి.హెచ్.రాజశేఖర్, ఎస్ఐ ఆర్.శివాజీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రమాదాల బారిన పడకుండా అంతా ఆనందంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఎటువంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా వెంటనే 112కు సమాచారమివ్వాలన్నారు.



సూచనలు చేస్తున్న పోలీస్ అధికారులు



ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ, మహా స్నపనం

సమ్మోహన రూపుడై..

- సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై విహరించిన శ్రీవారు
- వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం
- వాడపల్లిలో ఆరో రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన బుధవారం వేకువజామున సుప్రభాత సేవ, నవనీత హారతిలతో స్వామివారిని మేల్కొల్పారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టోత్తర శత కలశాభిషేకం, హోమాలను నిర్వహించారు. ఉదయం 10.34 గంటలకు శ్రీకృష్ణ అలంకరణలో శ్రీవారు సూర్యప్రభ వాహనంపై విహరించారు. సాయంత్రం స్వస్తివచనం, ప్రధాన హోమాలు, నవగ్రహ హోమం, శ్రీలక్ష్మీవేంకటేశ్వర మూలమంత్రపూర్వక వేంకటేశ్వరస్వామి హోమాలను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 7.10 గంటలకు మోహిని అలంకరణలో శ్రీవారు చంద్రప్రభ వాహనంపై అధిష్ఠించి తిరువీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని కనులారా చూసి తన్మయత్వం పొందారు.



సినిమా చిత్రీకరణకు క్లాప్ కొడుతున్న అంబికా కృష్ణ

అంబికా ఆలయంలో సినిమా చిత్రీకరణ

ఏలూరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నూతన నటీనటులు జాలా అరవింద్, పవిత్ర నటిస్తున్న సినిమా చిత్రీకరణ అంబికా ఆలయంలో పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రారంభమైంది. మెగా మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.1గా శ్యామ్ వట్టి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి సినీ నిర్మాత, అంబికా గ్రూప్ సంస్థల అధినేత అంబికా కృష్ణ క్లాప్ కొట్టి ప్రారంభించారు. వెంకట్ జుత్తిగ దర్శకత్వం వహించారు. అంబికా కృష్ణ మాట్లాడుతూ కంటెంట్ ఉంటే చిన్న చిత్రమైనా ఘన విజయం సాధిస్తుందన్నారు. ఇటీవల విడుదలైన చిన్న చిత్రాలు పెద్ద చిత్రాలకంటే ఘన విజయం సాధిస్తున్నాయన్నారు. నిర్మాత చిత్రానికి ఆయువు పట్టు లాంటివారన్నారు. డైరెక్టర్ వెంకట్ మాట్లాడుతూ పాత కొత్త తారాగణంతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామన్నారు. సీనియర్ నటులు ఆమని, శుభలేఖ సుధాకర్, గౌతమ్ రాజుతో పాటు మరో 25 మంది నటిస్తున్నారన్నారు. మార్చిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోనిరెడ్డి శ్రీనివాస్, వేగి వెంకట్రావు, కె మురళి, తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన జిల్లా జట్లతో వ్యాయామోపాధ్యాయులు

హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

పెదవేగి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు పెదవేగిలోని బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బుధవారం జరిగాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన 19ఏళ్ల విభాగం పోటీల్లో బాలురు, బాలికల జిల్లా జట్లను ఎంపిక చేశామని ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 400 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారని, వారిలో బాలికల జట్టుకు 16 మంది, బాలుర జట్టుకు 16 మంది క్రీడాకారులను ఎంపిక చేశామని జయరాజు చెప్పారు. ఎంపిక చేసిన జిల్లా జట్లు త్వరలో జరిగే జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని ఆయన వివరించారు. ఈ ఎంపిక పోటీల్లో గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎవి.శివప్రసాద్, పీడీలు అండాలు, సుబ్బారావు, ఇతర వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ఎన్టీఆర్ వైద్య భరోసా సేవలు పునరుద్ధరించాలి

ఆకివీడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య భరోసా సేవలు పునరుద్ధరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. వైద్య సేవలు నిలుపుదలతో పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రంప్ విధించిన సుంకాల ప్రభావంతో జిల్లాలో ఆక్వా, వ్యవసాయ రైతులు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆక్వా, వ్యవసాయ రంగాలను ఆదుకోవాలన్నారు. జీఎస్టీతో ఇప్పటికే రూ.60లక్షల కోట్లు ముక్కుపిండి వసూలు చేసి ఇప్పుడు తగ్గించామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. పిల్లలు వాడే స్టేషనరీ, పెన్సిల్, పెన్నులపై కూడా పన్ను వసూలు చేశారన్నారు. యువతకు ఉపాధి లేకపోవడం వలన నిరుద్యోగం పెరిగిందన్నారు. మహిళలకు 18 ఏళ్ల నిండిన వారికి రూ.1,500 ఎప్పుడు ఇస్తారన్నారు. అభివృద్ధి పేరుతో యుద్ధప్రాతిపదికన పేదల ఇళ్లు కూల్చివేయించిన ఎమ్మెల్యే వారికి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో వందలాది మంది పేదలు నిరాశ్రయులయ్యారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు మంతెన సీతారాం, చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, జక్కంశెట్టి సత్యనారాయణ, దూసి కళ్యాణి, ఎ.అజయకుమారి, కె.తవిటినాయుడు తదితరులు ఉన్నారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు



పంచాయతీ కార్యదర్శుల పదోన్నతులపై అంగీకార పత్రాలను స్వీకరిస్తున్న పశ్చిమ, ఏలూరు జిల్లాల డీపీవోలు

- గ్రేడ్-1 కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, వీడీవో, సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి
- డిప్యూటీ ఎంపీడీవోలుగా అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఉద్యోగుల నుంచి పదోన్నతికి అంగీకార పత్రాల స్వీకరణ
- జడ్పీ కార్యాలయంలో కౌన్సెలింగ్

ఏలూరు సిటీ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతి లభించనుంది. తొలుత గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, వీడీవోలు, సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించనున్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఉద్యోగుల నుంచి అంగీకార పత్రాల స్వీకరణ చేపట్టారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా డీపీవోలు కొడాలి అనూరాధ, రామిరెడ్డి అంగీకార పత్రాలు స్వీకరించారు. గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శులు, గ్రేడ్-2 ఈవోలు, గ్రేడ్ -1 పంచాయతీలలో వీడీవోలతో పాటు డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్ల నుంచి పదోన్నతులకు అంగీకార పత్రాలను తీసుకున్నారు.

పంచాయతీ రాజ్ సంస్కరణలలో భాగంగా అధిక జనాభా కలిగిన అర్బన్ పంచాయతీలకు వారిని డిప్యూటి ఎంపీడీవోలు, గ్రామ సచివాలయాల్లో మండల స్థాయి అధికారులుగా నియమించనున్నారు. పంచాయతీరాజ్ సంస్కరణలలో భాగంగా ఇప్పటి వరకు 5 గ్రేడ్‌ల విధానాన్ని 4 గ్రేడ్‌లకు మార్పు చేశారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలు (అర్బన్ పంచాయతీలు), గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్ 3 పంచాయతీలుగా విభజించారు. ఆయా పంచాయతీలలో కార్యదర్శులకు బదులు డిప్యూటి ఎంపీడీవోలుగా నియమితులవుతారు. ఈవోపీఆర్డీ వ్యవస్థ కనుమరుగు కానుంది. ఈవోపీఆర్డీ కేడర్‌నే డిప్యూటి ఎంపీడీవోలుగా మార్పు చేస్తున్నారు. తొలి విడతగా పంచాయతీ ఉద్యోగులకు పదోన్నతుల కార్యక్రమం ప్రారంభించారు. తర్వాత మిగిలిన విభాగాల్లో చేపట్టనున్నారు. పంచాయతీ రాజ్‌లో సంస్కరణలతో పంచాయతీలు బలోపేతం అవుతాయని భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియ ప్రారంభం కావడంలో ఎన్నికల పూర్తయ్యే సమయానికి పంచాయతీలను బలోపేతం చేయడం, గ్రామ పంచాయతీల్లో సౌకర్యాలను కల్పించడం ప్రభుత్వ లక్ష్యంగా చెబుతున్నారు.

కౌన్సెలింగ్‌కు 179 మంది

పదోన్నతుల కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 179 మంది హాజరయ్యారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు 143 మంది, గ్రేడ్ -2 ఈవోలు 20మంది, గ్రేడ్-1 పంచాయతీల్లో వీడీవోలు 13 మంది, డీపీవో, డీఎల్‌పీవో కార్యాలయాల్లో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు ముగ్గురు హాజరయ్యారు. బుధవారం జరిగిన అంగీకార పత్రాల స్వీకరణకు సంబంధించిన నివేదికను పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు పంపిస్తారు. రెండు జిల్లాల డీపీవోలతో పాటు ఏలూరు డీఎల్‌పీవో అమ్మాజీ, కార్యాలయ ఏఓ ఎంవి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల జీవితాలకు నమ్మకం కలిగించాలి

- కేరళ డీజీపీ ఆజాద్ చంద్రశేఖర్

వీరవాసరం (భీమవరం టౌన్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజల జీవితాలకు నమ్మకం కలిగించడం పోలీసుల బాధ్యత అని కేరళ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం గ్రామంలో జన్మించి, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించి అత్యున్నత పదవిలో పనిచేస్తున్న రావాడ ఆజాద్ చంద్ర శేఖర్‌కు వీరవాసరం గ్రామ ప్రజలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, కేరళ రాష్ట్రం డీజీపీగా ఎదగడానికి ప్రధాన కారణం గురువులు, ఊరి ప్రజల ఆశీస్సులే కారణం అన్నారు. తాను సాధారణ విద్యార్థినని, ఐపీఎస్ సాధించడంలో యోగ్యత, యోగం కూడా కలిసి ఉన్నాయన్నారు. యోగ్యత ఉంటే యోగం భగవంతుడు చూపిస్తాడని వ్యాఖ్యానించారు. పొలం పనులు కూడా చేశానని, విద్యార్థులు గురువుల ఉపదేశాలు, మార్గదర్శకంలో ఎంతో సాధించగలరన్నారు. ఇంటర్నెట్‌కు పిల్లలు బానిసలు కాకూడదని, సరైన మార్గంలో వాడుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ కేరళ డీజీపీగా చంద్రశేఖర్ పశ్చిమగోదావరి జిల్లావాసి కావడం ఎంతో గర్వించదగిన విషయం అన్నారు. ఎమ్మెల్యే పునపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని వ్యక్తి ఒక రాష్ట్రానికి డీజీపీ కావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. అనంతరం రావాడ చంద్రశేఖర్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్జి వీరవల్లి గోపాలకృష్ణ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డిప్యూటీ కలెక్టర్ పద్మ, సర్పంచ్ చికిలే మంగతాయరు తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

పంచాయతీరాజ్ X రెవెన్యూ

మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల మధ్య గోడ తగాదా
ప్రహరీ కూల్చివేశారంటూ రెవెన్యూ శాఖపై మండల పరిషత్ ఆరోపణ

పెంటపాడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ నిర్మాణంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు గొడవ పడుతున్నాయి. పెంటపాడు మండలంలో మండల పరిషత్, తహసీల్దార్, మహిళా సమాఖ్య, ఎంఈవో, సర్వేయర్, హౌసింగ్, వ్యవసాయ శాఖ తదితర కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గోడ కొంచెం మలుపు తిరిగింది. అక్కడ గోడను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది కూల్చి వేశారని, ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన గోడను బాధ్యత కల్గిన అధికారులు ఎలా కూల్చి వేస్తారని మండల పరిషత్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలం అక్కడి వరకూ మాత్రమే ఉందని, దీనితో తాము గోడను ఆవిధంగా నిర్మించామని చెబుతున్నారు.

దీనిపై తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మరో విధంగా చెబుతున్నారు. తొలుత తమకు గోడను ఇలా నిర్మాణం చేస్తామని చెప్పలేదని, గోడవరకూ కట్టి ఫెన్సింగ్ వేస్తామన్నారన్నారు. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా గోడ ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. తాము గోడను పడగొట్టలేదని ఉదయం నిర్మాణం చేయడంతో స్థలం చూసే ప్రయత్నంలో అనుకోకుండా గోడ పడిపోయిందని చెబుతున్నారు. అయితే రెవెన్యూ వర్గాల వాదనను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఒప్పుకోవడం లేదు. కొన్ని రోజుల క్రితం గోడ నిర్మాణం జరిగిందని, బుధవారం కేవలం ప్లాస్టింగ్ మాత్రమే చేయడం జరిగిందంటున్నారు



పడిపోయిన ప్రహరీ

గోడ కూల్చడం సరికాదు

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సి వారు ఇలా గోడను కూల్చడం సరికాదు సమస్య ఉంటే నేరుగా వచ్చి మాతో మాట్లాడాలి. ఇలా కూలగొట్టడం సమంజసం కాదు. కనీసం మాతో సంప్రదించలేదు ఇలా జరిగినందుకు చాలా బాధగా ఉంది. జరిగిన సంఘటన స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- పీవీవీఎస్ రాంప్రసాద్, ఎంపీడీవో

మాకు చెప్పకుండా నిర్మించారు

గోడ నిర్మాణంపై ముందు మాకు ఒక విధంగా చెప్పారు. తరువాత ప్లాన్ మార్చి వేరేవిధంగా నిర్మించారు. కనీసం మాతో సంప్రదించలేదు. ఇలా చేయడం సరికాదు. మా వాళ్లు గోడ పడగొట్టలేదు. అప్పుడే కట్టిన గోడ కారణంగా స్థలం చూసేప్పుడు అది పడిపోయింది. దీనిపై గురువారం సర్వేయర్‌ని పిలిపించి సర్వే చేయిస్తాం.

- రాజరాజేశ్వరి, తహసీల్దార్

17, 18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఈనెల 17, 18 తేదీలలో చర్లపల్లి, అనకాపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. రైల్ నెంబర్ 07097 చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఈనెల 17న రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.30 గంటలకు అనకాపల్లి చేరుకుంటుంది. 07098 అనకాపల్లి నుంచి 18న సాయంత్రం 5.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లల్లో ఫస్ట్‌క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని తెలిపారు.



వంగ తోటను ఆశించిన పురుగులు

తీరంలో వంగ తోటలు పరిశీలించిన అధికారులు

మొగల్తూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తీర గ్రామాల్లో వంగ తోటల్లో తెగుళ్లపై ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఉద్యాన శాఖ అధికారులు స్పందించారు. పలు గ్రామాల్లోని వంగ తోటలు పరిశీలించి ఉన్నతాధికారులకు పరిస్థితిని వివరించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కల వారితోట, నల్లంవారితోట, పోతులవారి మెరకలో సాగు చేసిన వంగ తోటలను జిల్లా ఉద్యానవన అధికారి ప్రియదర్శిని ఆదేశాలతో ఏవో నిహారిక వంగ మొక్కలు, పురుగులు పరిశీలించి నమూనాలను సేకరించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని జిల్లా అధికారి ఆధ్వర్యంలో సస్యరక్షణకు చర్యలను చేపడతామని రైతులకు భరోసా ఇచ్చారు.

జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం

ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో కక్షిదారుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నూతనంగా నిర్మించిన క్యాంటీన్ బిల్డింగ్ సముదాయాన్ని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.సురేష్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శ్రీదేవి మాట్లాడుతూ 2018 నుంచి ఏలూరు కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కృషి జరిగిందన్నారు. హైకోర్టు అనుమతితో క్యాంటిన్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో 14 కోర్టులు ఉన్నాయని ఈ కోర్టులలో వివిధ కేసుల నిమిత్తం వందలాది మంది కక్షిదారులు, న్యాయవాదులు సాధారణ ప్రజలు వస్తూ ఉంటారని వివరించారు. వారికి అసౌకర్యం కలగకుండా ఆహారాన్ని అందించే నిమిత్తం క్యాంటీన్‌ను ప్రారంభించడం జరిగిందన్నారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామ్ మర్యాదపూర్వకంగా ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ నేముల రాయుడు, జాయింట్ సెక్రటరీ ఇబ్రహీం షరీఫ్, కోశాధికారి గండికోట సీతారామరాజు, గద్దె విజయ భాస్కర్, పొట్ల దుర్గ భవాని, లైబ్రరీ సెక్రటరీ కిశోర్, జిల్లా పీపీ ఏవి నారాయణ పాల్గొన్నారు. బిల్డింగ్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌ను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. పలువురు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.



క్యాంటీన్ ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా జడ్జి

యర్రాయిచెర్వు సర్పంచ్‌పై కేసు

ఇరగవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యర్రాయిచెర్వు సర్పంచ్ మహిళపై దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. తణుకు మండలం కొమరవరం గ్రామానికి చెందిన ఆకుల ఉమా మహేశ్వరి స్థలం కొనుగోలు నిమిత్తం రూ.2 లక్షల సొమ్మును యర్రాయిచెర్వు గ్రామానికి చెందిన జుత్తిగ శ్రీనివాస్‌కు ఇచ్చింది. తర్వాత భర్తతో మాట్లాడి స్థలం కొనుగోలు చేయడం లేదని డబ్బులు తిరిగి ఇవ్వాలని శ్రీనివాస్‌ను కోరింది. అతడు సమాధానం చెప్పకపోవడంతో ఉమామహేశ్వరి పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల వద్ద డబ్బు ఇస్తానని చెప్పి రూ. లక్ష ఇచ్చాడు. మిగతా లక్ష ఇచ్చేందుకు యర్రాయిచెర్వు సర్పంచ్ జుత్తిగ వెంకట మహేష్‌రావు హామీపై ఒప్పందం కుదుర్చుకున్నారు. తర్వాత శ్రీనివాస్‌కు ఉమామహేశ్వరిదేవి ఫోన్ చేయడంతో దుర్భాషలాడాడు. దీనితో ఆమె సర్పంచ్ జుత్తిగ వెంకట మహేష్‌రావుకు విషయం చెప్పడానికి వెళ్లింది. సర్పంచ్ మహేష్ కూడా తనపై దాడికి పాల్పడ్డాడు. ఆమె ఫిర్యాదు మేరకు సర్పంచ్ వెంకట మహేష్‌రావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇరగవరం హెడ్‌కానిస్టేబుల్ కృష్ణారావు తెలిపారు. మరోవైపు జుత్తిగ వెంకట మహేష్‌రావు భార్య కృష్ణకుమారి ఉమామహేశ్వరిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఉమామహేశ్వరి డబ్బులు ఇప్పించండి అంటూ తన భర్త జుత్తిగ వెంకట మహేష్‌రావును దుర్భాషలాడిందని, డబ్బు ఇప్పించకపోతే అంతు చూస్తానంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఇరువురి ఫిర్యాదులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పురోహితుడి మృతి

పాలకొల్లు టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): నరసాపురం రోడ్డులో ప్రభుత్వాసుపత్రి సమీపంలో బుధవారం జరిగిన ప్రమాదంలో పురోహితుడు మరణించారు. పోడూరు మండలం జిన్నూరుకు చెందిన శివకోటి అప్పారావు (60) మోపెడ్‌పై దిగమర్రు వైపు నుంచి పాలకొల్లు వస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు పట్టణ సీఐ కె.రజనీకుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ రజనీ కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్కూటర్‌పై వెళుతున్న వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో ఆశ్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. విజయవాడకు చెందిన హెచ్.రాజేష్ (57) హార్డ్‌వేర్ బిజినెస్ చేస్తున్నాడు. స్కూటర్‌పై బుధవారం రాజమండ్రి వెళ్తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ రైల్వే బ్రిడ్జి వద్ద ఆయన రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మోటారు సైకిల్ అదుపు తప్పి పడిపోయారా లేదా మరేదైనా వాహనం ఢీకొందా అనే వివరాలు తెలియరాలేదు. తీవ్ర గాయాలకు గురైన రాజేష్‌ను సమీపంలోని ఆశ్రం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ డిక్కీలో బంగారం, రూ.4 లక్షలు కొట్టేశారు

భీమడోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండుగొలను గ్రామంలో స్కూటర్ డిక్కీలో ఉంచిన సుమారు 8 కాసుల బంగారం, రూ.4 లక్షల నగదును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం పాత సినిమా హాలు సమీపంలో ఉంటున్న పెనుగంటి బుజ్జి బ్యాంక్‌లో తాకట్టు పెట్టిన 8 కాసుల బంగారం విడిపించాడు. రూ.4 లక్షలు నగదు విత్ డ్రా చేసి స్కూటీ డిక్కీలో ఉంచాడు. మార్గమధ్యంలో కర్రీ పాయింట్ వద్ద ఆగి పార్సిల్ కట్టించుకుని ఇంటికి వెళ్లే నేపథ్యంలో డిక్కీ తెరచి చూడగా బంగారం, నగదు మాయమైనట్లు గుర్తించాడు. అయితే స్కూటీ డిక్కీకి తాళం లేకపోవడంతో ఈ చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు. దీనిపై భీమడోలు పోలీసులను ఆశ్రయించగా సీఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు. మాయమైన నగదు, బంగారం ఎంత అనేది ఇంకా పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించలేదు.

కుమారుడికి కన్నీటి వీడ్కోలు

కొడుకు చివరి కోరిక తీర్చిన తల్లి



అరుణ్ కుమార్ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కుమారుడికి జన్మనిచ్చిన తల్లి కన్నీటితో అంతిమ వీడ్కోలు పలికింది. తాడేపల్లిగూడెం మండలం పడాలలో హృదయ విదారక ఘటన బుధవారం చోటుచేసుకుంది. అనారోగ్యం పాలైన కొడుకు తన అంతిమ సంస్కారాలు తల్లే చేయాలని కోరుకోవడంతో కొడుకు మృతదేహాన్ని ఖననం చేసి తుది వీడ్కోలు పలికి చివరి కోరిక తీర్చింది. పడాలకు చెందిన గుజ్జు అరుణ్ కుమార్ (35) రెండేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. తండ్రి పదేళ్ల క్రితం మరణించడంతో తల్లి జయంతి అన్నీ తానై ప్రేమగా పెంచారు. తన చివరి సంస్కారాలు తల్లే చూడాలని కోరడంతో కొడుకు మృతదేహం వెంట వెళ్లి సంస్కారాలు దగ్గరుండి చేశారు. ఈ దృశ్యాలు స్థానికులను కలిచివేశాయి.

గంజాయి తరలిస్తూ పాలకొల్లు వాసి అరెస్టు

పాలకొల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా హనుమాన్ సర్కిల్ వద్ద మంగళవారం ఎక్సైజ్ పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి 4కిలోల గంజాయి, రవాణాకు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు మోహన్ సుందర్ పాలకొల్లు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, ఆయన గుత్తి మండలంలో పూజారిగా పనిచేస్తున్నట్టు గుర్తించారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
కైకలూరు, నూజివీడు

' చేతులు శుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యం'

ముసునూరు/చాట్రాయి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతులు శుభ్రంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ముసునూరు ఎంపీడీవో పిల్లి ఏసుబాబు అన్నారు. బుధవారం అంతర్జాతీయ హ్యాండ్ వాష్‌డే సందర్భంగా ముసునూరు పాఠశాలలో విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఎంఈవో-2 బీవీఎస్ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సత్యప్రసాద్ పాల్గొన్నారు. చాట్రాయి మండలం తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం గంపా వెంకట్రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

'ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలి'

నూజివీడు టౌన్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి):మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలు అన్ని రంగాల్లో రాణించాలని నూజివీడు డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎస్.పద్మావతి అన్నారు. నూజివీడు త్రివిధ పాఠశాలలో బేటీబచావో బేటీపడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరమని, బాల్యవివాహాలు చట్టప్రకారం నిషేధమని, ఆధునిక యుగంలో బాలురతో పాటు బాలికలు పోటీపడుతు న్నారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసుధ పాల్గొన్నారు.

గూగుల్ సంస్థతో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు

» కైకలూరులో టీడీపీ నాయకుల హర్షం



గూగుల్ ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

కైకలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గూగుల్ సంస్థ రావడంతో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయని, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కైకలూరు నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. బుధవారం కైకలూరులో టీడీపీ నాయకులు గూగుల్ సంస్థ ఒప్పందంపై హర్షం వ్యక్తం చేస్తూ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఐటీ రంగాన్ని ప్రోత్సహించడంలో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ ఎనలేని కృషి చేశారన్నారు. చంద్రబాబు అరెస్టు సమయంలో పలు దేశాల్లో స్థిరపడిన ఐటీరంగ ఉద్యోగులంతా ఆయన అరెస్టును ఖండిస్తూ హైదరాబాదు గచ్చిబౌలిలో పది వేలమందితో ఉద్యమం చేశారని వారి ఉద్యమ ఫలితాలే ప్రస్తుతం గూగుల్ సంస్థ రాష్ట్రానికి వచ్చిందన్నారు. గూగుల్ అంటే ఏమిటో తెలియక కొంతమంది వైసీపీ నాయకులు వారిష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా గూగుల్ ప్లకార్డులతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ కో-కన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజీఎస్ మాల్యాద్రి, పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రారావు, పార్టీ జిల్లా నాయకుడు కేకే బాబు, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, మాజీ ఎంపీపీ పోసిన పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

'నూరుశాతం ఈ-పంట నమోదు చేయాలి'


ఆగిరిపల్లిలో మాట్లాడుతున్న హబీబ్ బాషా

ఆగిరిపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదును నూరుశాతం పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా సూచించారు. బుధవారం ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామంలోని రైతు సేవా కేంద్రం, నూజివీడు మండలం తుక్కులూరు ఆర్‌ఎస్‌కే వద్ద సిబ్బందితో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదును అక్టోబరు 25వ తేదీ లోపు పూర్తి చేయాలని రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జిలను ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ-పంట నమోదు ఆగిరిపల్లి మండలంలో 95 శాతం, నూజివీడు మండలంలో 98 శాతం పూర్తయిందన్నారు. రైతులందరూ పంట నమోదు చేయించు కోవాలని, అప్పుడే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వై.సుబ్బారావు, ఉద్యాన సహాయకులు, రైతులు, పాల్గొన్నారు.

చేవూరులో చేపల చెరువుల పరిశీలన


చేవూరులో చేపల చెరువులను పరిశీలిస్తున్న తహసీల్దార్

ముదినేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చేవూరులో చేపల చెరువుల నుంచి వస్తున్న వృథా నీటి వల్ల ఆ గ్రామ దళితవాడ వాసులకు ఏర్పడుతున్న ముంపు సమస్యను బుధవారం తహసీల్దార్ లతీఫ్ పాషా, రెవెన్యూ అధికారులు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి దళితవాడ ప్రజలకు న్యాయం చేయాలని మంగళవారం చేవూరులో దళితులు రాస్తారోకో నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ పాషా చెరువుల నుంచి నీరు దళితవాడలోకి వెళ్లకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్థానికులతో చర్చించారు. ఈ సమస్యపై గురువారం చేవూరులో గ్రామ సభ నిర్వహించి తగిన నిర్ణయం తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. చెరువుల పక్కనే వృథానీరు పోయేం దుకు వెడల్పయిన కాల్వను తవ్వించాలని, అందుకు ఎవరూ అడ్డుకట్టలు ఏయకుండా చూడాలని మద్దుల అశోక్ తదితరులు కోరారు. ఆర్ఐ రాజశేఖర్, వీఆర్వో రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలతో డ్రెయిన్ల అభివృద్ధి పనులు


ఉప్పరగూడెం సమీపంలో పెదలంక మేజర్ డ్రెయిన్‌లో నిర్వహిస్తున్న పూడికతీత పనులు

ముదినేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ముంపు నివారణలో భాగంగా ముదినేపల్లి, బంటుమిల్లి, పెడన మండలాల్లోని వేలాది ఎకరాల ఆయకట్టుకు మురుగునీటి పారుదల సౌకర్యం కల్పిస్తున్న పెదలంక మేజర్ డ్రెయిన్, అన్నవరం మీడియం డ్రెయిన్లను సుమారు రూ.50 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే పెదలంక మేజర్ డ్రెయిన్‌ను ముదినేపల్లి మండలం దేవపూడి నుంచి కలిదిండి మండలం ఆవకూరు వరకు ఆరు కిలోమీటర్ల దూరం రూ.18 లక్షల నిధులతో తవ్వకం పనులు, కిక్కిస తొలగింపు పనులు పూర్తి చేశారు. ఉప్పరగూడెం నుంచి దేవపూడి వరకు పూడిక తొలగింపు పనులను రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్వహిస్తున్నారు. మరో రూ.8 లక్షల వ్యయంతో అన్నవరం మీడియం డ్రెయిన్ తవ్వకం పనులు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో ముంపు నివారణకు డ్రెయిన్ల అభివృద్ధి పనులను పెద గొన్నూరు డీసీ చైర్మన్ గుడిసేవ సురేష్‌బాబు ఆధ్వర్యంలో పెదలంక మేజర్ డ్రెయిన్‌లో పూడిక తొలగింపు పనులను నిర్వహిస్తున్నారు. ఈ డ్రెయిన్ తవ్వకం వల్ల మండలంలో సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టులోని పంట భూముల్లో ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

మండవల్లిలో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'

మండవల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' వల్ల ఇంటి నిర్మాణ సామగ్రి, సిమెంట్‌పై జీఎస్టీ పది శాతం తగ్గిందని, ఇది లబ్ధిదారులకు ఎంతో మేలు కలుగుతుందని ఎంపీడీవో వై.రామకృష్ణ పేర్కొన్నారు. మండవల్లిలో బుధవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మెండా ఝాన్సీ సురేష్‌బాబు, కార్యదర్శి గిరిజా, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

చదువుల సందడి

(7వ పేజీ తరువాయి)

భవనం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి డిగ్రీ, పీజీ అడ్మిషన్లు తీసుకునే విద్యార్థులకు తరగతుల నిర్వహణ కోసం అందుబాటులోవున్న భవనాలు ఎక్కడున్నాయనే దానిపై ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి చెంతన హనుమాన్ జంక్షన్-నూజివీడు మార్గంలో విశ్వ విద్యాలయం ఏర్పాటుకు తొలి ప్రాధాన్యతనిస్తున్నారు. ఏలూరు జిల్లాలోనే నూజివీడు ఉండటం కలిసొచ్చే అంశం. ఆ తర్వాత దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలోని ప్రభుత్వ వ్యాయామ విద్య శిక్షణ కళాశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన బాలుర వసతి గృహం భవనాన్ని పూర్తి చేసి అక్కడ యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని ముందుగా ప్రారంభించి, ఆ తదుపరి కళాశాల ప్రాంగణంలోనే విడిగా వున్న 6.50 ప్రభుత్వ పోరంబోకు భూముల్లో విశ్వ విద్యాలయానికి అవసరమైన అన్ని భవనాల నిర్మాణం చేపట్టాలనే ప్రతిపాదన ఒకటి పరిశీలనలో ఉంది. ఈ క్రమంలో కళాశాలలో రూ.66 లక్షలు ఖర్చు చేసి, ఇప్పటికే 50 శాతానికిపైగా నిర్మాణాలు పూర్తయి అసంపూర్తిగా నిలిచిపోయిన బాలుర వసతి గృహాన్ని పూర్తి చేయడానికి మరో రూ.25 లక్షలు సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయడానికి ఏలూరు ఎంపీ ఇటీవల హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామవిద్య శిక్షణ కళాశాల ప్రాంగణంలోనే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వద్ద పట్టుబట్టినట్టు సమాచారం. ఇక గతంలోనే విజయవాడ సమీపంలోని గొల్లపూడిలో యూనివర్సిటీ భవన నిర్మాణం నిమిత్తం స్థానిక గ్రామ పంచాయితీకిచెందిన 1.20 ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్నికూడా అధికారవర్గాలు గుర్తుచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏలూరుకు సమీపంలో ఏర్పాటుచేయతలపెట్టిన అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపన ఖరారు ఏ ప్రాంతంలో ఉంటుందోనన్న డైలమా కొంతకాలంగా కొనసాగుతూనే ఉంది. తాజాగా విశ్వ విద్యాలయానికి ఉపకులపతిని నియమించడంతో ఇప్పటి వరకు వున్న గందరగోళ పరిస్థితులకు తెరపడే అవకాశం ఉంది.

వీవోఏలకు ఉద్యోగ భద్రత

(7వ పేజీ తరువాయి)

అధికారంలోకి వస్తే మూడేళ్ల నిబంధన తొలగిస్తామని హామీ ఇచ్చారు. తాజాగా ఈ నిబంధనలను తొలగించడంతోపాటు వీరిని తొలగించే అధికారాన్ని ఏపీఎం నుంచి డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు బదలాయించారు. వీవోఏలపై మరింత పనిభారంతో సతమతం అవుతున్నారు. ఎస్‌హెచ్‌జీల యాప్‌ల నిర్వహణకు 4జీ నెట్‌వర్క్‌తో సాధ్యం కాకపోవడంతో దానిని 5జీ నెట్‌వర్క్‌తో పనిచేసే మొబైల్ ఫోన్లు అందిస్తామని ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 1,354 మంది మహిళలకు ప్రయోజనం కలగనుంది.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

» అక్రమ వినియోగంపై రూ.16.27 లక్షల జరిమానా


చేవూరు చేపల చెరువుపై విద్యుత్ మీటరును తనిఖీ చేస్తున్న అధికారులు

ముదినేపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని గృహ, వాణిజ్య, ఆక్వా రంగ విద్యుత్ వినియోగంపై బుధవారం విద్యుత్ శాఖ, విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అదనపు లోడు, విద్యుత్ చౌర్యాన్ని గుర్తించి రూ.16.27 లక్షల జరిమానా విధించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్.వాసు ఆధ్వర్యంలో 46 బృందాలు 460 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేసి అదనపు లోడు అక్రమ వినియోగం, విద్యుత్ చౌర్యాన్ని గుర్తించి 452 సర్వీసుల్లో అదనపు లోడు వినియోగానికి రూ.15.52 లక్షలు, 8 సర్వీసులకు చెందిన వినియోగదారులు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నందుకు రూ.75,694 జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ వాసు విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం జరిగినట్లు గమనించిన వారు 94408 12091, 94408 12086 నంబర్లకు ఫోన్ చేయాలని ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. గుడివాడ డివిజన్ ఈఈ జి.బి.శ్రీనివాసరావు, ఏడీఈ పి.కిరణ్‌బాబు, ముదినేపల్లి ఏఈఈ బి.పూర్ణచంద్రరావు, అధికారులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీల్లో కైకలూరు విద్యార్థినులకు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

కైకలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):స్కేటింగ్ పోటీల్లో కైకలూరుకు చెందిన ఇరువురు విద్యార్థులు జిల్లా స్థాయిలో రెండు బంగారు, మూడు వెండి పతకా లను సాధించారు. ఇటీవల ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో కైకలూరుకు చెందిన ఎ.జ్ఞానచాతుర్య (5వ తరగతి), కె. రామరష్మిక్రప్రియ(3వ) పోటీల్లో పాల్గొన్నారు. చాతుర్య 200మీటర్ల స్కేటింగ్ పోటీల్లో బంగారు పతకం, 500 మీటర్ల పోటీల్లో వెండి పతకాన్ని, రోడ్-4 పోటీల్లో వెండి పతకం సాధించింది. రష్మిక్రప్రియ 200 మీటర్ల పోటీల్లో బంగారు పతకం, 500 మీటర్ల పోటీల్లో వెండి పతకాన్ని సాధించింది. వీరిద్దరూ నవంబరు మొదటి వారంలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బంగారు పతకాలు సాధించడంపై కైకలూరుకు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

క్రీడా పోటీల్లో మీర్జాపురం జడ్పీ విద్యార్థుల ప్రతిభ

నూజివీడు టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండల స్థాయి క్రీడాపోటీల్లో మీర్జాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్ఎం కోనేరు శ్రీదేవి తెలిపారు. బాలుర సీనియర్స్ విభాగంలో వాలీబాల్‌లో కలపాల హర్షవర్ధన్, కబడ్డీలో ఎస్.అజయ్, ఖోఖోలో విక్రమ్, అభి, కార్తీక్, కోటేశ్వరరావు, బ్యాడ్మింటన్‌లో కార్తీక్ ప్రతిభ కనబరిచారన్నారు. వీరితో పాటు మరో ఏడుగురు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు ఆమె తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు టీవీ నాగేశ్వరరావు, ఏడీవీ ఆర్తిను ఆమె అభినందించారు.

పెయ్యేరు పాఠశాలలో కిచెన్ గార్డెన్ సక్సెస్


పైనాపిల్‌తో టీచర్లు, విద్యార్థుల ఆనందం

ముదినేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన కిచెన్ గార్డెన్ కార్యక్రమం పెయ్యేరు మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో విజయవంతమైంది. కిచెన్ గార్డెన్ ద్వారా పాఠశాల ఆవరణ ఆహ్లాదకరంగా ఉండడంతో పాటు, పలు రకాల పండ్లు, కూరగాయల మొక్కలు పెంపకం విజయవంతంగా జరుగుతుంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు సమష్టిగా గార్డెన్‌ను పెంచి సుందరంగా తయారు చేశారు. మార్కెట్‌లో అధిక ధరకు అమ్ముడుపోయే పైనాపిల్ కాయలను కాయించారు. ఈ ఏడాది మూడు నుంచి నాలుగు కేజీల బరువు గల పైనాపిల్ కాయలు లభించాయి. హెచ్ఎం బేతాళ రాజేంద్రప్రసాద్, టీచర్ చక్రధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు కిచెన్ గార్డెన్‌ను పెంచడంలో ఆసక్తి చూపించారు.

జిల్లా కోర్టు ఆవరణలో క్యాంటీన్ ప్రారంభం

» ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తులు


క్యాంటీన్ ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు, జిల్లా జడ్జి

ఏలూరు క్రైం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలో కక్షిదారుల సౌకర్యాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నూతనంగా నిర్మించిన క్యాంటీన్ బిల్డింగ్ సముదాయాన్ని హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి కె.సురేష్‌రెడ్డి, హైకోర్టు న్యాయమూర్తి సత్తి సుబ్బారెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ 2018 నుంచి ఏలూరు కోర్టు ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటు చేసేందుకు కృషి జరిగిందన్నారు. హైకోర్టు అనుమతితో క్యాంటిన్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలో 14 కోర్టులు ఉన్నాయని ఈ కోర్టులలో వివిధ కేసుల నిమిత్తం వందలాది మంది కక్షిదారులు, న్యాయవాదులు సాధారణ ప్రజలు వస్తుంటారని వివరించారు. వారికి అసౌకర్యం కలగకుండా ఆహారాన్ని అందించే నిమిత్తం క్యాంటీన్‌ను ప్రారంభించామన్నారు. తొలుత కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులను ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామ్ ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. బిల్డింగ్ కమిటీ చైర్మన్ విజయకుమార్‌ను ముఖ్య అతిథులు సత్కరించారు.


చాట్రాయి ఎంపీడీవో కార్యాలయం ప్రధాన ద్వారం మూసి నిరసన తెలుపుతున్న కృష్ణారావుపాలెం టీడీపీ నాయకులు

'ఏడేళ్ల నాటి సీసీ రోడ్డు పనుల బిల్లులు ఇవ్వాలి'

చాట్రాయి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెంలో ఏడేళ్ల క్రితం చేసిన సీసీ రోడ్డు పనుల బిల్లులు ఇవ్వాలని ఆ గ్రామ టీడీపీ నాయకులు, వార్డు మెంబర్లు డిమాండ్ చేశారు. బుధవారం చాట్రాయి ఎంపీడీవో కార్యాలయ ప్రధాన ద్వారం మూసివేసి వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ తడికమళ్ళ రామారావు, తెలుగు మహిళా నాయకురాలు ఊట్ల ధనలక్ష్మి, వార్డు మెంబర్లు మాట్లాడుతూ 2017-18లో టీడీపీ కార్యకర్త గుంజి రామకృష్ణ తమ వీధిలో సీసీ రోడ్డు పనులు చేయగా, సుమారు నాలుగేళ్ల క్రితం రూ.2.43 లక్షల బిల్లు సొమ్ము పంచాయతీ అకౌంట్‌కు జమైనా కాంట్రాక్టర్‌కి చెల్లించలేదన్నారు. విషయం తెలుసుకుని పంచాయతీ కార్యదర్శిని అడగ్గా రూ.80 వేలు ఇచ్చారని, మిగతా సొమ్ము ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని, తమకు సొమ్ము ఇచ్చే వరకు నిరసన విరమించే ప్రసక్తే లేదని కూర్చున్నారు. సమాచారం తెలుసుకున్న చాట్రాయి పోలీసులు వచ్చి వారిని స్టేషన్‌కి తరలించి బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పర్చారు. అనంతరం బిల్లు సొమ్మును నవంబరు 14లోగా చెల్లిస్తామని నూజివీడు డీఎల్‌పీవో సుందరి సమక్షంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు టీడీపీ నాయకులకు హామీ ఇచ్చారు.

'మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి'

కైకలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నివాసాల మధ్య మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఆర్.రాజబాబు సూచించారు. బుధవారం కైకలూరు మండలం వరహాపట్నం, రాచపట్నం, గోపవరం పంచాయతీలలో శానిటైజేషన్ పనులను పరిశీలించారు. వర్షాల వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు మురుగునీరు పారుదలకు చర్యలు తీసుకుని సున్నం, బ్లీచింగ్ చల్లాలన్నారు. చెత్తను ఇంటింటికి తిరిగి తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్తసంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు ఉప్పలపాటి నాగమణి, అల్లూరు మంగారావు, ఉలిసి వసంతకుమారి, మండల పరిషత్ ఏవో కె.బాలశంకరరావు, పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవాలయంలో భిక్ష ప్రారంభం


లోకుముడి అయ్యప్ప దేవస్థానంలో ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం

మండవల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): లోకుముడిలో వున్న అయ్యప్ప స్వామి దేవాలయంలో సకల మాలధారులకు అన్నదాన(భిక్ష) కార్యక్రమాన్ని బుధవారం ప్రారం భించారు. రాష్ట్రంలో అతిపెద్ద ఏకశిల పదునెట్టాంపడి కలిగిన అయ్యప్ప స్వామి ఆలయంలో వరుసగా 18 ఏళ్లనుంచి దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం జరుగుతున్నట్లు గురుస్వామి అప్పారావు తెలిపారు. తొలిరోజు 450 మాలధారులకు అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమం జనవరి ఒకటో తేదీ వరకు జరుగుతుందని తెలిపారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

కైకలూరు/కలిదిండి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కైకలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజీఎస్ మాల్యాద్రి, నియోజకవర్గ కో-కన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రావు, మైనార్టీ నాయకులు ఎండీ జానీ, ఎండీ ఉస్మాన్, సయ్యద్ బషీర్, పార్టీ సీనియర్ నాయకుడు వేములపల్లి కారుణ్య, కేకే బాబు, వీరాబత్తిన సుధా, పడమటి వాసు పాల్గొన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లులో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం కూటమి నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కేశిరెడ్డి బలరామ్, మంతెన రామరాజు, వలవల రమేష్, నున్న సుబ్రహ్మణ్యం, కేశిరెడ్డి వేణు, రాజేష్, శ్రీరామకృష్ణ, అందె బాబీ పాల్గొన్నారు.

గోగులంపాడు రోడ్డు అభివృద్ధికి ప్రతిపాదనలు

ముసునూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోగులంపాడు కొత్తూరు- ముక్కొల్లుపాడు వెళ్లే బీటీ రోడ్డులో వంతెన కింద ఉన్న రహదారి అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. ఈ రహదారి సమస్యను టీడీపీ నాయకులు, రైతులు ఇటీవల మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఈ రోడ్డు అభివృద్ధికి కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆయన ఆదేశించారు. బుధవారం పంచాయతీరాజ్ డీఈ కమలకుమార్, ఏఈ దుర్గాప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబులు సంయుక్తంగా వంతెన కింద ఉన్న రహదారిని పరిశీలించి, కొలతలు వేసి సూమారు రూ.5లక్షలు నిధులు అవసరమని అంచనా తాయారు చేశారు. ఈ ప్రతిపాదనను మంత్రి పార్థసారథికి అందజేస్తామని, నిధులు విడుదల కాగానే అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పీఆర్ డీఈ తెలిపారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్రబాబు, సీనియర్ నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, మండవ బ్రహ్మేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పోతనపల్లి-చాట్రాయి రోడ్డులో మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ నాయకుల సొమ్ముతో రోడ్డుకు మరమ్మతులు

చాట్రాయి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పోతనపల్లి-చాట్రాయి మధ్య డొంక రోడ్డుకు టీడీపీ నాయకులు సొంత నిధులతో బుధవారం మరమ్మతులు చేపట్టారు. పోతనపల్లి- చాట్రాయి గ్రామాలకు ఇది దగ్గర దారి కావడతో నిత్యం ఈ రోడ్డులో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డులో వందల ఎకరాలు వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ రోడ్డుకు ఇరువైపులా ముళ్లకంపలు పెరిగి, రోడ్డు గోతులు పడి అధ్వానంగా తయారై ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు లావూరి వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు దారావత్తు భాస్కరరావు సొంత నిధులతో సుమారు మూడు కిలో మీటర్ల దూరం రాకపోకలకు అనువుగా మార్చడంతో ప్రజలు, రైతులు హర్షం వ్యక్త చేస్తున్నారు.

17,18 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఈ నెల 17,18 తేదీల్లో ప్రత్యేక రైళ్లను చర్లపల్లి, అనకాపల్లి మధ్యలో నడుపుతున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు బుధవారం రాత్రి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైలు నంబరు 07097 చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఈనెల 17వ తేదీ శుక్ర వారం రాత్రి 7.30 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.30 నిమిషాలకు అనకాపల్లి చేరుకుంటుంది. 07098 అనకా పల్లి నుంచి 18వ తేదీ సాయంత్రం 5.35 నిమిషాలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.15 నిమిషాలకు చర్లపల్లికి చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాల గూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి రైల్వే స్టేషన్లలో ఆగనున్నాయి.

బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లకు స్థల పరిశీలన

కలిదిండి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని టెలికాం ఆఫీసర్ అందూరి శోభన్‌బాబు తెలిపారు. బుధవారం సంతోషపురం, లోడిదలంక, కొండూరు గ్రామాల్లో తహసీల్దార్ రామకృష్ణతో కలిసి సెల్ టవర్ల ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ కలిదిండి మండలానికి మూడు సెల్ టవర్లను మంజూరు చేసిందన్నారు. ఆ మూడు గ్రామాల్లో ఒక్కో టవర్ నిర్మాణానికి 4 నుంచి 5 సెంట్లు స్థలం ఉండాలన్నారు. విద్యుత్, రహదారి, వాటర్ సరఫరాకు అనుకూలంగా ఉన్న స్థలా లను పరిశీలిస్తున్నామని త్వరలో నిర్మాణాలు చేపడతామన్నారు. సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి

కైకలూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ఉద్యోగాల పేరిట సైబర్ నేరగాళ్ల మోసాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీను అన్నారు. బుధవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై, పోక్సో కేసుపై, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శాంతిజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులపై నిఘా

నూజివీడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కల్తీమద్యం ఘటనల నేపథ్యంలో నూజివీడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలపై పూర్తి నిఘాను ఏర్పాటు చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఎక్సైజ్ ఐ-యాప్ ద్వారా షాపులపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా కల్తీమద్యం గుర్తిస్తే ఎక్సైజ్ సీఐ కార్యాలయం దృష్టికి, 94409 02462 నంబరుకు లేదా ఎక్సైజ్ సురక్షాయాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

బాణసంచా నిల్వ చేసిన వ్యక్తి అరెస్టు

ఆగిరిపల్లి, అక్టోబరు 15, (ఆంధ్రజ్యోతి): అక్ర మంగా బాణసంచా నిల్వ చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం వట్టిగుడిపాడులో ఎస్ఐ శుభశేఖర్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన జ్యోతి దానకర్ణ అనే వ్యక్తి లైసెన్స్ లేకుండా అక్రమంగా ఇంటిలో నిల్వ చేసిన రూ.50 వేలు విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ శుభశేఖర్ మాట్లాడుతూ అక్రమంగా బాణసంచా నిల్వలు ఉంచిన వారి సమాచారం తెలిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యముగా ఉంచుతామన్నారు.